క్లుప్తంగా

అమరుల ఆశయసాధనే టీజేఎస్ లక్ష్యం



రాంనగర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు

ముషీరాబాద్: రాష్ట్ర సాధన కోసం అసువులు బాసిన అమరవీరుల లక్ష్యాలను సాధించడమే టీజేఎస్ లక్ష్యమని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. తెలంగాణ జన సమితి 5వ ఆవిర్భావ వేడుకలు శనివారం అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు కాకునూరి సుధాకర్ ఆధ్వర్యంలో రాంనగర్ గుండు వద్ద ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతూ.. రాజకీయ లక్ష్య సాధన కోసం జన సమితి పని చేస్తోందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు, ముషీరాబాద్ ఇన్‌చార్జ్ ఎం.నర్సయ్య మాట్లాడుతూ.. తమ పార్టీలోనే ఎమ్మెల్యేలు కమిషన్లు తీసుకుంటున్నారని సీఎం చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. టీజేఎస్ అంబర్‌పేట్ ఇన్‌చార్జ్ జస్వంత్ కుమార్, యువజన సమితి రాష్ట్ర అధ్యక్షులు సలీంపాషా, పార్టీ నగర నాయకులు జైపాల్ రెడ్డి, సుధాకర్, పవన్ తదితరులున్నారు.

కనీస పెన్షన్ రూ.7500లు చెల్లించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పెన్షనర్లకు కనీస పెన్షన్ నెలకు రూ.7500లతో పాటు డీఏ చెల్లించాలని జాతీయ సంఘర్షణ సమితి ఈపీఎస్ 1995 పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సామ రాంరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్లకు జీవిత భాగస్వామ్యంతో పాటు ఉచిత మెడికల్ సౌకర్యం కల్పించాలన్నారు. 2014 ఎన్నికల్లో ప్రధాని 20 రోజుల్లో కోషియారీ కమిటీ రిపోర్టును అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. వారు అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి దాకా అమలు చేయక పోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీలక్ష్మి, జాతీయ నాయకులు ఆశోక్ రావత్, జాతీయ కో–ఆర్డినేటర్ రమాకాంత్ నర్గుండ్ తదితరులున్నారు.

ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

అంబర్‌పేట: ప్రజా అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం అంబర్‌పేట డివిజన్ బీలాల్ మజీద్‌లేన్‌లో రూ.10 లక్షలతో నిర్మించనున్న తాగునీటి పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశలవారీగా నియోజకవర్గంలో ఉన్న పైప్‌లైన్ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి శాశ్వత ప్రతిపాదికన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లోని మున్సిపల్ కాలనీలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే సందర్శించారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా షర్మిలకున్ను

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా డాక్టర్ షర్మిలకున్ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరు రాంచందర్ ప్రకటించారు. శనివారం అసోసియేషన్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు వివరించారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ సురేష్‌కుమార్, జి.సునాయనా, కె.విజయరాణి, ప్రధాన కార్యదర్శిగా ఎం.కృష్ణసాహితి, సంయుక్త కార్యదర్శిగా రోజా, వైష్ణవి, రాజేశ్వరి జాస్తి, కోశాధికారిగా దివ్యలోచన, కార్యవర్గ సభ్యులుగా అనితరాణిపట్నాయక్, డాక్టర్ బి.శ్రీనివాస్‌రావులు ఎన్నికయ్యారు.

వరద నీరు చేరకుండా తగిన చర్యలు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్ బస్తీలో వరదనీరు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అధికారులను అదేశించారు. శనివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి అరుంధతీనగర్‌లో వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుస్సేన్‌సాగర్ నాలాకు రిటైనింగ్ వాల్ నిర్మిచడం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. రోడ్డుపై నుంచి వరద నీరు చేరాయని వరద నీరు చేరకుండా శాశ్వతంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ, ముఠా నరేష్, అధికారులు శ్యామ్ సుందర్, బీఆర్ఎస్ నాయకులు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, సత్యనారాయణ పాల్గొన్నారు.

కుండపోతకు కాలనీలు కకావికలం!

- ఇళ్లల్లోకి చేరిన వరద నీరు
- రోడ్లన్నీ బురదమయం
- నేలకొరిగిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్
- రెండు క్రేన్‌ల సాయంతో వాహనాలను బయటకు తీసిన రెస్క్యూ టీమ్
- ఎమ్మెల్యే సహా కార్పొరేటర్లు, అధికారుల పర్యటన

భారీ వర్షంతో ఉప్పొంగిన రాంనగర్ నాలా • కొట్టుకుపోయిన సుమారు 30 ద్విచక్ర వాహనాలు



పద్మాకాలనీలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



బస్తీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్



పద్మాకాలనీలో వరద ఉధృతికి ప్రధాన రహదారి ఇలా..



ద్విచక్ర వాహనాలను బయటికి తీస్తున్న దృశ్యం



అపార్ట్‌మెంట్ ముందు నెలకొరిగిన విద్యుత్ స్తంభం

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం అడిక్‌మెట్ డివిజన్‌లోని పద్మాకాలనీ శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి కకా వికలమైంది. ప్రజలు భయంతో వణికిపోయారు. సికింద్రాబాద్, వారాసిగూడ, అంబర్‌నగర్, రాంనగర్, పద్మాకాలనీ మీదుగా వెళ్లి హుస్సేన్‌సాగర్ నాలాలో కలిసే ఈ రాంనగర్ నాలాకు పై నుంచి వచ్చిన భారీ వరద తోడవ్వడంతో ఒక్కసారిగా నాలా ప్రమాదస్థాయికి మించి ప్రవహించింది.

ఎమ్మెల్యే పర్యటన..

పద్మాకాలనీలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. యుద్ధ ప్రాతిపాదికన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్‌లోని సూర్యనగర్ బస్తీ వర్షంతో జలమయమైంది. బస్తీలోని కాలనీలన్ని నీట మునిగాయి. మోకాళ్ల లోతు నీరు రావడంతో సూర్యనగర్ బస్తీలోని ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు కూడా కొంత దూరం వరకు కొట్టుకుపోయాయి. ఉదయం కార్పొరేటర్ రవిచారితో పాటు ఎమ్మెల్యే తనయుడు ముఠా జైసింహ పర్యటించారు.

చిక్కడపల్లి: కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టిన రిటర్నింగ్ వాల్ నిర్మించిన హుస్సేన్‌సాగర్ నాలా పరివాహక బస్తీ ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదని వర్షాల వల్ల 30 ఇళ్లలోకి నీరు చేరి జన జీవనం అస్తవ్యస్తంగా మారిందని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం డివిజన్‌లోని అరుంధతీనగర్, సబర్మతి, బాపూజీ నగర్‌తో పాటు జలమయమైన చాలా ప్రాంతాలను ఆమె పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నాయకులు ఎం.ఉమేష్, అనిత, లక్ష్మణ్‌యాదవ్, అరుణ్‌కుమార్, చిర్రాయాదగిరి, రాజేందర్, గోపీ, ఆనంద్‌రావు, ప్రశాంత్, డేవిడ్, సతీష్, స్థానికులు పుష్ప, మీన, రాణి, ఏలీయా, పద్మ, శ్రీను, భారతమ్మ పాల్గొన్నారు.

అంబర్‌పేట: కుండపోత వర్షంతో నాలాలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివిధ ప్రాంతాల్లో చెట్లు నెల కూలాయి. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

నల్లకుంట: గాలివానకు నల్లకుంటలోని పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లు నిండి వరద నీటితో పొంగిపొర్లాయి. దీంతో వీధుల్లో మోకాలిలోతు వరద నీరు చేరింది. డివిజన్ పరిధిలోని మయూరి లేన్, తిలక్‌నగర్ రైల్వే ట్రాక్ లేన్ తదితర ప్రాంతాల్లో ఉదయం వరకు వరద నీటి ప్రవాహం అలాగే కొనసాగింది. వీధులు వరద నీటితో ముంచెత్తటంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

◆ గోల్నాక చర్చి ప్రధాన రహదారిలో ఓ భారీ వృక్షం నేలకొరింగింది. విద్యుత్ స్తంబాలు, వీధిలైట్ల స్తంబాలు కూలి పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్ స్తంభాలు కూలిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి స్థానికులు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ అమృత వరద నీటితో ముంచెత్తిన ప్రాంతాల్లో పర్యటించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందం చెట్టు కూలిన ప్రాంతానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. రోడ్డుకు అడ్డుగా పడిన చెట్టు మొదళ్లను, చెట్టు కొమ్మలను తొలగింపచేశారు. జీహెచ్ఎంసీ సర్కిల్–6 డీఎంసీ వేణుగోపాల్, కార్పొరేటర్ అమృత, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ సహాయక పర్యవేక్షించారు.



తిలక్‌నగర్ రైల్వే ట్రాక్ సమీపంలో మ్యాన్ హోళ్లను శుభ్రం చేయిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది



గోల్నాక చర్చి సమీపంలో కూలి పడిన చెట్టు

క్రమశిక్షణతో చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులతో ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం ముషీరాబాద్‌లో రేడియంట్ హై స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాపర్స్‌డే కార్యక్రమంలో భాగంగా 1నుంచి పదో తరగతి వరకు ప్రతిభకనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, పతకాలను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్‌తో కలిసి విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఆయా రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తుందన్నారు. రేడియంట్ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ అన్వరుల్లా బక్తీయార్, ప్రిన్సిపల్ సయ్యద్ అహ్మద్ బక్తీయార్, ఉపాధ్యాయులు ఆస్రాఫాతిమా, మంజుశ్రీ, అనీఫా, బీఆర్ఎస్ నాయకులు అభినందన్‌యాదవ్, ఎండీ మోయిన్, మహ్మద్ ఖదీర్ తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన

కాచిగూడ: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకునేలా యువత కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎక్కాల కన్నా పిలుపునిచ్చారు. శనివారం కాచిగూడ చెప్పల్‌బజార్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్న విద్యార్థులు, యువతకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు.

◆ రైతు బంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, దళిత బంధు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, పింఛన్లు, తదితర పథకాలు దేశ వ్యాప్తంగా ప్రజలందరికీ అవసరమన్నారు.

◆ దేశ ప్రజలందరికీ ఈ సంక్షేమ పథకాలను అందించేందుకు సీఎం కేసీఆర్ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారని తెలిపారు.

◆ యువత ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ నేతలు మున్నాసింగ్, కిట్టు, అశోక్ కాక, సాగర్, శేఖర్, కొండ అంజమ్మ, సునీత, లక్ష్మి, ప్రియ, మంజు తదితరులున్నారు.

కార్పొరేటర్ ఆధ్వర్యంలో ధర్నా



వాటర్‌వర్క్స్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్‌లో తాగునీటి సమస్యతో పాటు డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. బాగ్‌లింగంపల్లిలోని వాటర్‌వర్క్స్ కార్యాలయం ఎదుట రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి, సంజయ్‌నగర్ బస్తీ వాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా తాగునీటి సరఫరాలో సమయ పాలన పాటించడం లేదని డ్రైనేజీ సమస్య పరిష్కరించడం లేదని వారు వాపోయారు. ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు మోరపెట్టుకున్న స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాంనగర్ డివిజన్‌లోని పాలమూరు బస్తీ, ఎల్ఐజీ, సూర్యానగర్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో తాగునీటితో పాటు డ్రైనేజీ సమస్య కూడా తీవ్రంగా ఉందన్నారు. సంజయ్‌నగర్ బస్తీ అధ్యక్షులు విష్ణు, బీజేవైఎం ముషీరాబాద్ కన్వీనర్ గడ్డం నవీన్, నాయకులు కె.ఉపేందర్, శ్రీనివాస్, కిరణ్, ఎర్రోళ్ల సతీష్ తదితరులతో పాటు మహిళలు పాల్గొన్నారు.

జలమండలి మేనేజర్‌ను తొలగించాలి: కార్పొరేటర్ రవిచారి

జలమండలి అధికారి జీవనజ్యోతిని తొలగించాలి ఆమెకు ఎన్నిసార్లు తాగునీటి సమస్యపై ఫోన్ చేసిన కనీసం స్పందించడం లేదు. ఇదేమిటని ఆమె కార్యాలయానికి వెళ్లి ప్రశ్నిస్తే మీకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధికి జవాబు చెప్పకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన విచారణ చేపట్టి అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

కచ్చా మోరీల్లో పూడికతీత

కాచిగూడ: వర్షపు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కచ్చా మోరీల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో రోడ్లపై నీరు నిలిచి స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం కురిసిన బారి వర్షానికి కాచిగూడ డివిజన్ పర్వరీష్ బాగ్‌లో రోడ్లపై నీరు నిలవడంతో కుద్బిగూడలో పాత గోడ కూలిపోయింది. దీంతో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించి వర్షపు నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో పేరుకుపోయిన పూడికను తొలగించారు. స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మౌలానా ఆజాద్‌నగర్ బస్తీలో వర్షపు నీరు వెళ్లిన ఇళ్లను పరిశీలించారు. జీహెచ్ఎంసీ డీఎంసీ వేణుగోపాల్, ఈఈ రాజు, ఏఎంఓహెచ్ జ్యోతిబాయి, తిరుపతి, రాము, బీజేపీ నేతలు బి.భీమ్‌రాజ్, నరేష్, ఎస్.రవియాదవ్, ఆర్.సంతోష్, సూరి, దినేష్, ఓంప్రకాష్ తదితరులున్నారు.

చెత్త వేస్తే రూ. వేయి జరిమానా



చెత్తను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

కాచిగూడ: కుద్బిగూడలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను తొలగించి అక్కడ పార్కును ఏర్పాటు చేసేందుకు బీఆర్ఎస్ సీనియర్ నేత సునిల్ బిడ్లాన్ ముందుకొచ్చారు. తన సొంత నిధులతో మొక్కలను ఏర్పాటు చేసి పార్కుగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. శనివారం జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన పార్కు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశాల మేరకు ఇక్కడ మొక్కలు, గడ్డిని పెంచి మినీపార్కు ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ.1000 జరిమానా విధిస్తామని జీహెచ్ఎంసీ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ సిబ్బందికి వ్యర్థాలను అందించాలని సూచించారు. పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని అందరూ.. ఆ దిశగా కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మ దేవ్, డాక్టర్ బద్దుల ఓంప్రకాష్ యాదవ్, బబ్లూ సింగ్, అంటోని, రాజేష్ తదితరులున్నారు.

నేడు వాసవి మాత జయంతి

ముషీరాబాద్: వాసవి కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలు రాంనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సుధాకర్‌గుప్తా ప్రకటించారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కుంకుమార్చన మొదలవుతుందని అందరూ.. ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు నేతి సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్, చామల శ్రీనివాస్, చంద్రప్రకాష్, సత్యానందం, నాగేందర్‌లు కోరారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్ పోస్ట్ ఆఫీస్ దగ్గర శనివారం డ్రైనేజీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ సునీతాప్రకాష్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సురేందర్, మనోహర్‌సింగ్, శ్యామ్ సుందర్, మాధవ్, సయ్యద్ అస్లాం, బొట్టు శ్రీను, నేత శ్రీను, రవియాదవ్, అబ్బు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

కాచిగూడ: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు విమర్శించారు. చిన్నపాటి వర్షానికే మహానగరం అస్తవ్యస్తంగా మారిందని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. డ్రైనేజీలు పొంగిపోర్లుతూ.. వరదల్లో కొట్టుకుపోయి మరణిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ కళాసీగూడలో జరిగిన ఘటనలో చిన్నారి మృతికి భాద్యత వహిస్తూ.. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని గౌతంరావు డిమాండ్ చేశారు.

◆ నగరంలో డ్రైనేజీ విస్తరణ పనులు పూర్తి చేయకుండా తూతూ మంత్రంగా మ్యాన్‌హోళ్ల నిర్మాణం చేస్తుండటంతో వర్షాలు వచ్చినప్పుడు ప్రజలు తీవ్ర సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

◆ వర్షాలు వచ్చినప్పుడు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలో ఎవరో ఒకరు వరదల్లో కొట్టుకుపోతున్నా.. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

'ప్రజల ప్రాణాలను బలితీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం'



మాట్లాడుతున్న కె.గీతామూర్తి


కాచిగూడ: ప్రజలకు సరైన వసతులు, సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి ఆరోపించారు. శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. నగరంలో కురిసిన భారీ వర్షాలకు కళాసీగూడలో మ్యాన్‌హోల్‌లో 6 ఏళ్ల చిన్నారి పడి వరదల్లో కొట్టుకుపోయి చనిపోయిందని దీనికి పూర్తి బాధ్యత సీఎం కేసీఆర్‌దేనన్నారు.

◆ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ప్రజల ప్రాణాలను బలితీసుకుంటున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

◆ గతేడాది సరూర్‌నగర్ వరదల్లో కొట్టుకుపోయి మరణించిన వారికి ఇంత వరకు ఏ సాయం ప్రభుత్వం ఇవ్వలేదన్నారు.

◆ వచ్చే ఏడాది నుంచి ఇలాంటివి జరగవని మంత్రులు ఇచ్చిన హామీ ఏమాత్రం అమలుకు నోచుకోవడం లేదన్నారు. దీనికి శనివారం మ్యాన్‌హోల్‌లో పడి పాప మరణించిన ఘటనే సాక్ష్యం అన్నారు.

◆ మరణించిన చిన్నారి కుటుంబానికి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, వారి ఇంటిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, కుటుంబానికి ఒక డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383